# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

శనివారం 12 జులై 2025




# చెక్కులు పంచకుండా కౌశిక్ రెడ్డి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు

- కెసిఆర్ నేర్పిన సంస్కారం ఇదేనా...
- చెక్కుల విషయంలో వేరే చోట రాని సమస్య కౌశిక్ రెడ్డికి ఎందుకు వస్తుంది
- అర్హులైన వారికి దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు
- సోషల్ మీడియా మీద ఉన్న ప్రేమ ప్రజల సమస్యలపై లేదు
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి
- కార్యకర్తలకు ప్రణవ్ సూచన





**జమ్మికుంట, జూలై 11 (నినాదం) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలలలో చేసిన అభివృద్ధి బిఆర్ఎస్ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పటికీ చేయలేదని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో సుమారు 150 సీఎం చెక్కులు అందజేయనున్నామని అందులో భాగంగా హుజురాబాద్ మండలంలో 16 లక్షలకు పైచిలుకు విలువగల 39 చెక్కులను పంపిణీ చేశామని,ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్ క్యాబినెట్లో ఆమోదించామని హుజురాబాద్ నియోజకవర్గం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని,కమలాపూర్ మండలంలో గడువు ముగిసిన కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని,గతంలో కూడా ఇదేవిధంగా గడువు ముగిసిన చెక్కులను మరల రీవాలిడేషన్ చేసి ఇచ్చారని,ఏడు నెలల క్రితం చెక్కులను ప్రభుత్వం అందిస్తే ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని ఇదేనా కేసీఆర్ శిష్యరికం అని ప్రశ్నించారు.అంతలా ఇబ్బంది ఉంటే చెక్కులు పంచకుండా ఉంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేస్తారని అన్నారు.కళ్యాణ లక్ష్మి చెక్కుల విషయంలో అధికారులు వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు.ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సోషల్ మీడియాలో రిల్స్ చేయడం మీద ఉన్న ప్రేమ ప్రజలపై లేదని అన్నారు.హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇప్పటికే 3500 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశామని,దఫలవారీగా అందరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కేటాయిస్తామని,సాంకేతిక కారణాల వలన ఆగిన ఇళ్లను కూడా అందజేస్తామని,త్వరలో అసంపూర్తిగా నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు నిధులు కేటాయించి లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం స్కాంములకు,అవినీతి బెదిరింపులతోనే కాలం వెల్లదీశారని అన్నారు.గత పది సంవత్సరాలుగా తెలంగాణ వ్యాప్తంగా ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గంలో సుమారు 3500 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన చేస్తుందని,అందుకే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తుందని అన్నారు.కౌశిక్ రెడ్డి పై కావాలని ఎవరు కేసులు పెట్టలేదని తాను చేసిన దౌర్జన్యాలతో పాటు తననడవడిక సరిగా లేదని కేసులు నమోదయాయని అన్నారు.నాపై కన్ను పెడితే ఏకే 47 గన్ అవుతానని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకుంటున్నారని,ఏకే 47 గన్ అయి ప్రజలను చంపుతారా అని ఆయన ప్రశ్నించారు?.కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటి నుంచి ఇప్పుడు బీఆర్ఎస్ వరకు కౌశిక్ రెడ్డి ఆగడాలపై ఎన్నో కేసులు నమోదు అయ్యాయని,కౌశిక్ రెడ్డి చరిత్ర మొత్తం కేసులమయం అని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు.ఎమ్మెల్యే పద్ధతి మార్చుకోకుంటే ఊళ్ళలో తిరగనివ్వమని హెచ్చరించారు.త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు క్యాడర్ సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ఇల్లందుకుంట మండల కేంద్రంలో చెక్కులు అందజేసిన ప్రణవ్..**

ఇల్లందుకుంట మండల కేంద్రంలో 17 మంది లబ్ధిదారులకు 7 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.కాంగ్రెస్ పార్టీ పేదల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తుందని,అర్హులైన అందరికి ఆదర్శమైన ప్రజాపాలన అందిస్తామని అన్నారు.

# వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించండి

**- ఇల్లందకుంట రామాలయం, కొండగట్టు అంజన్న ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించండి**

**- సానుకూలంగా స్పందించిన టీటీడీ ఛైర్మన్**

**- టీటీడీ బోర్డు ఛైర్మన్ నాయుడును కోరిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్, జులై 11(నినాదం) :** కరీంనగర్ లో టీటీడీ ఆధ్వర్యంలో భూమిపూజ చేసిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్. నాయుడుని కోరారు. బండి సంజయ్ తిరుమలలో టీటీడీ ఛైర్మన్ నాయుడును కలిశారు. గతంలోనూ బండి సంజయ్ టీటీడీ ఛైర్మన్ ను కలిసి ఈ అంశాన్ని ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మళ్లీ కరీంనగర్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన నిర్మాణ అంశాన్ని లేవనెత్తారు. భూమిపూజకే పరిమితమయ్యారని, ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని వివరించారు. కరీంనగర్ లో శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం కోసం లక్షలాది మంది భక్తులు ఎదురు చూస్తున్నారని, వారి ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. దీంతోపాటు హుజూరాబాద్ నియోజకవర్గం లోని పురాతన ఇల్లందకుంట రామాలయం, కొండగట్టు అంజన్న ఆలయాల చరిత్రను బండి సంజయ్ వివరించారు. నిధుల్లేక ఈ చారిత్రక ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆయా ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి సమగ్ర అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. తక్షణమే టీటీడీ తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన టీటీడీ ఛైర్మన్ నాయుడు అతి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఘనంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి జన్మదిన వేడుకలు



**జమ్మికుంట జూలై 11 (నినాదం) :** ఇల్లంతకుంట మండల కేంద్రంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్రసత్య ప్రసన్నారెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కొడెం రజిత ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు అర్చనలు చేసి కేక్ కట్ చేసి స్వీట్స్ పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎంపీటీసీగా తాజా మాజీ సర్పంచ్ గా సేవలు అందించారని రానున్న కాలంలో వారు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన బండి సంజయ్ జన్మదిన వేడుక సంబరాలు

- జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగిన బండి సంజయ్ పుట్టినరోజు వేడుకలు
- భారీ ఎత్తున బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీ
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అల్పాహారం, అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడికృష్ణారెడ్డి



**కరీంనగర్, జులై 11(నినాదం) :** కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుక సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం రోజున బండి సంజయ్ కుమార్ పుట్టినరోజును పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బిజెపి శ్రేణులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్న దాన కార్యక్రమాలు, అల్పాహారం, కేక్ కటింగ్, స్వీట్లు, మొక్కల పంపిణీ ల తో పాటు పలు సేవా కార్యక్రమాలను భారీ ఎత్తున చేపట్టారు. బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ లో బండి సంజయ్ జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, స్వీట్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ క్షేత్రస్థాయిలో దిగ్విజయనేత అని కొనియాడారు. కార్పొరేటర్ నుండి ఎంపీ, కేంద్రమంత్రి స్థాయికి బండి సంజయ్ ఎదిగిన తీరు కార్యకర్తలకు ఆదర్శం, స్ఫూర్తిదాయకమన్నారు. సరస్వతీ శిశు మందిరం లో విద్యనభ్యసించిన బండి సంజయ్ కుమార్ ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని అన్నారు. ఆర్ఎస్ఎస్ లో ఘటన్ నాయక్ గా, ముఖ్య శిక్షక్ గా ప్రాథమిక విద్యా స్థాయిలోనే బండి సంజయ్ పని చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం అఖిల భారత విద్యార్థి పరిషత్ ఏబీవీపీ లో, బిజెపి కరీంనగర్ పట్టణ ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షులుగా, జిల్లా , రాష్ట్ర కార్యవర్గాల్లో వివిధ హోదాల్లో బిజెపిలో ఆయన బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. భారతీయ జనతా పార్టీ కేరళ, తమిళనాడు రాష్ట్రాల ఇన్చార్జిగా ను ఆయన పని చేశారని, ఎల్కే అద్వానీ చేపట్టిన రథయాత్రలోనూ బండి సంజయ్ కుమార్ భాగం పంచుకున్నారని , 35 రోజులపాటు దేశవ్యాప్తంగా జరిగిన ప్రచారంలో పాల్గొన్నారని తెలిపారు. 1994 బి 2003 మధ్యకాలంలో బండి సంజయ్ కుమార్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గా పని చేశారన్నారు. 2005లో కరీంనగర్ 48వ డివిజన్ నుండి కార్పొరేటర్ గా బండి సంజయ్ విజయం సాధించారని, వరుసగా మూడుసార్లు ఆయన కార్పొరేటర్ గా గెలుపొందారన్నారు. 2019 లో కరీంనగర్ పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ కుమార్ పార్టీని బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో రాష్ట్రంలో జరిగిన దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికలు జిహెచ్ఎంసి ఎన్నికలు చరిత్ర సృష్టించాయన్నారు. బండి సంజయ్ దిశా నిర్దేశంలో రాష్ట్రంలో బిజెపి గ్రాఫ్ పెరిగిందన్నారు. అనంతరం బండి సంజయ్ బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారని తెలిపారు. కరీంనగర్ చరిత్రలోనే భారీ మెజారిటీతో రెండోసారి బండి సంజయ్ పార్లమెంట్ సభ్యునిగా గెలుపొంది, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం దేశ, రాష్ట్ర బిజెపి కీలక నేతల్లో బండి సంజయ్ ఒకరని చెప్పారు. ప్రధానంగా కరీంనగర్ పార్లమెంటు సర్వతో ముఖాభివృద్ధి కోసం బండి సంజయ్ కుమార్ అహర్నిశలు కృషి చేస్తున్నారని, రెండు టర్ములలో పార్లమెంటు పరిధిలో దాదాపు 20,000 కోట్ల అభివృద్ధి పనులు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. లోగడ బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా అనేక కార్యక్రమాలు చేపట్టారని , ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాల కల్పన కోసం కృషి చేశారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల సైకిల్లు విద్యార్థిని విద్యార్థులకు అందించడం గొప్ప విషయమన్నారు . హుజురాబాద్ బిజెపి నేత నల్ల సుమన్ ఆధ్వర్యంలో 200 మందికి భోజనాన్ని అందించారు.

# కవిత డిమాండ్‌కు తలొగ్గిన రేవంత్ రెడ్డి సర్కార్

**- తెలంగాణ జాగృతి యూపిఎఫ్ సాధించిన మరో విజయం**

**- హైదరాబాద్ లో కవితక్కను కలిసి శుభాకాంక్షలు చెప్పిన గుంజపడుగు హరిప్రసాద్**



**కరీంనగర్, జులై 11(నినాదం) :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ మరియు జాగృతి అధ్వర్యంలో సంవత్సర కాలంగా కవితక్క నాయకత్వం పోరాటం నిరంతర పోరాట ఫలితమే ఈరోజు తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ బిసి రిజర్వేషన్ మీద ఆర్డినెన్స్ తీసుకురావడం ముమ్మాటికి ఇది బడుగు బలహీన వర్గాల విజయంగా తెలంగాణ కుల సంఘాల నాయకులు బడుగు బలహీన వర్గాల ప్రజలు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో పొందుపరిచిన నలబై రెండు శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాలయాపన చేయడంతో కవితక్క గత సంవత్సర కాలంగా నిరంతరం బీసీల పక్షాన బడుగు బలహీన వర్గాల పక్షాన 42 శాతం రిజర్వేషన్ అమల చేయాలనే ఏకైక లక్ష్యంగా అందరినీ కలుపుకుని ఉద్యమం చేయడం ద్వారానే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి 42% రిజర్వేషన్ ఇవ్వడం కోసం ఆర్డినెన్స్ తేవడం అంటే ఈ రాష్ట్రంలో బిసిల శకం ప్రారంభం అయిందని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ఆయన వెంట యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు గొట్టం మహేష్, పొన్నం అనిల్ గౌడ్, భారతం అఖిల్, చరణ్, తదితరులు ఉన్నారు.

# ఘనంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు



**జమ్మికుంట జులై 11 (నినాదం) :** ఇల్లందకుంట బిజెపి మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రం లో కేంద్ర మంత్రి పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి, స్వీట్స్, పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఇల్లందకుంట మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ ఒక సామాన్య కార్యకర్త నుండి జాతీయ స్థాయి నాయకునిగా కేంద్ర మంత్రిగా ఎదగడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు, అనేక రకాల ప్రజా ఉద్యమాలు చేసి కింది స్థాయి నుండి వచ్చిన నాయకుడు అని అన్నారు, అలాగే కార్పొరేటర్ స్థాయి నుండి కేంద్ర మంత్రి గా ఎదిగిన అయన జీవితం, నేటి కార్యకర్తలకు, యువకులకు ఆదర్శమన్నారు. అటు కేంద్రమంత్రిగా ఇటు కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా సక్రమంగా బాధ్యతను నిర్వహిస్తూ గొప్ప పేరు సంపాదించుకున్నారన్నారు. సంజయ్ జన్మదిన పురస్కరించుకొని కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ స్కూల్లో చదువుతున్నటువంటి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 20 వేల సైకిళ్లను పంపిణీ చేయడం గొప్ప మనస్తత్వానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుత్తికొండ రాంబాబు, ఆరెల్లి శ్రీనివాస్,అబ్బిడి తిరుపతి రెడ్డి, కంకణాల సురేందర్ రెడ్డి,ఎండీ షఫీ,గురుకుంట్ల సాంబయ్య, నల్ల లింగారెడ్డి, బొమ్మాడి శ్రీధర్,మట్ట పవన్ రెడ్డి,తాళ్ల పాపిరెడ్డి, మురహరి గోపాల్, ఇంగ్లే రమేష్, చదువు సాయిరెడ్డి, మద్దూరి మల్లేష్,ఉప్పు దుర్గయ్య, కొక్కుల దేవేందర్, ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, గురుకుంట్ల సంజీవ్, తిప్పరబోయిన సమ్మయ్య, బక్కతట్ల రాకేష్,ఇరువాల రమేష్, చిట్ల శ్రీనివాస్, కోడం భరత్, చిప్పతి శ్రీకాంత్,శీలం సాయిప్రసాద్ రెడ్డి, భద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి

**- వంచ శ్రీనివాస్ రెడ్డి కన్వీనర్ అడ్ హాక్ కమిటీ, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గం**



**కరీంనగర్, జులై 11(నినాదం) :** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాయని, ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా పటిష్టం చేయడంపై దృష్టి చారించిందన్నారు. స్థానిక సంస్థల్లో గాలి తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉందని, స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రభావం ఎంత ముఖ్యమో పోటీ చేసే అభ్యర్థికి ఉన్న ఇమేజ్ కూడా అంతే ముఖ్యమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామ, మండల, మున్సిపాలిటీల పరిధిలో వ్యక్తిగత ఓటు బ్యాంకు ఉన్న వారంతా పోటీలో ఉండాలని పిలుపునిచ్చారు. మిగిలిన కార్యకర్తలు పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తీసుకోవా లన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచే కసితో పని చేసి ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. అందుకు ఎన్నికల ప్రణాళిక రూపొందించుకొని రంగంలోకి సన్నద్ధం కావాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా ఏ విధంగా గ్రామాల అభివృద్ధిని నిర్వీర్యం చేసిందో గ్రామాలకు ఏ విధంగా ద్రోహం చేసిందో ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలతో ఛీ కొట్టించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అన్ని నియోజకవర్గంలో బలమైన క్యాడర్ కలిగి ఉందని, పార్టీ శ్రేణులు తలుచుకుంటే తెలుగుదేశం పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచే అవకాశం ఉంటుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం కొన్ని పార్టీలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ రోడ్డెక్కి డ్రామాలు చేస్తున్నాయని. నీళ్లు చంద్రబాబుకు, నిధులు ఢిల్లీకి అని కొందరు టిఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి పిచ్చెక్కి మాట్లాడుతున్నారు. తెలంగాణ వచ్చింది, కెసిఆర్ కుటుంబ పాలన జరిగింది, లక్షల కోట్లు తెలంగాణ ప్రజల ఆస్తులను దోపిడీ చేశారు, లక్షల కోట్లు సంపాదించుకున్నారు. కానీ తెలంగాణ ప్రజలకు ఒరుగుపెట్టింది ఏమీ లేదు. మళ్లీ తెలంగాణ సెంటిమెంట్తో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే పార్లమెంటు ఎన్నికలలో జరిగిన గుణపాఠం స్థానిక సంస్థల ఎన్నికలలో జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రజలు టిఆర్ఎస్ పార్టీని ఛీకొట్టి తూ అన్న సిగ్గు లేకుండా ప్రవర్తించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ సెంటిమెంట్తో అధికారంలోకి వచ్చి పదేళ్లు పాలన చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో తెలంగాణ ప్రజలకు, అమరవీరులకు చేసింది ఏందో సూటిగా కెసిఆర్ సమాధానం చెప్పాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. కుట్రలు కుతంత్రాలు, ఫోన్ టాపింగ్, లిక్కర్ స్కాం, భూముల స్కామ్, అనేక అక్రమాలతో పాలన సాగించి లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన కల్వకుంట్ల కుటుంబం అధికారం కోల్పోయిన తర్వాత పిచ్చి పట్టినట్టు నలుగురు మాత్రమే మీడియా ముందుకు వచ్చి చంద్రబాబును విమర్శించడం అవివేకం. నిద్రలేచిన నుండి చంద్రబాబు జపం చేయనిదే కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవితమ్మకు నిద్ర పట్ట దన్నారు. చంద్రబాబు అంటే నిప్పు కణం తాకితే మసైపోతారు జాగ్రత్త. చంద్రబాబు గురించి మాట్లాడితేనే తెలంగాణలో కెసిఆర్ అధికారం కోల్పోవడం జరిగిందని గుర్తు చేసుకుంటే మంచిది అన్నారు. టిఆర్ఎస్ పార్టీలో ఇతర పార్టీల నుండి అరువు తెచ్చుకున్న నాయకులు ఏమయ్యారు వారు మీడియా ముందుకు వచ్చి ఎందుకు మాట్లాడరు, మాట్లాడే దమ్ము ధైర్యం లేదా లేక ఈ కల్వకుంట్ల కుటుంబం వారికి అవకాశం ఇవ్వడం లేద తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి అవినీతి సొమ్ము పోగుచేసి భారతీయ రాష్ట్ర సమితి పేరుతో తెలంగాణ ప్రజల సొమ్మును ఇతర రాష్ట్రాలలో దారా దత్తం చేసి తెలంగాణ ప్రజలను వంచించి ప్రధాని కావాలని కలలుగన్న కెసిఆర్ కనుమరుగైపోవడం జరిగిందన్నారు.

# వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



**మల్హర్ జూలై 11 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం. కేంద్రం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్లారం గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రోగాలకు సంబంధించిన జాగ్రత్తలు మరియు రోగులకు షుగర్, బీపీ,డెంగ్యూ, మలేరియా తదితర వైద్య పరీక్షలు నిర్వహించి,రోగుల సంబంధిత టెస్టులు చెసి వారిని సంబధించిన మందులు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే వర్షా కాలం లో సీజన్ వ్యాధుల గురించి మరియు జాగ్రత్తలు చెప్పారు వాటికి తగు జాగ్రత్తలు వైద్యులను అడిగి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పడం జరిగింది ఇందులో డాక్టర్ సృజయ్, సూపర్వైజర్ రాధ ,ఏఎన్ఎం లక్ష్మి, ఉమ ,ఆశ వర్కర్లు హసీనా బేగం, శారద, రాధా, గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో పాత విద్యుత్ స్తంభాలు తొలగింపు



**వనపర్తి ప్రతినిధి, జులై 11 (నినాదం) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని19వ వార్డు గాంధీనగర్ లో పాత విద్యుత్ స్తంభాలు, ఇండ్లపై ఉన్న వైర్లను తొలగించి కొత్తగా 12 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగిందని మాజీ కౌన్సిలర్ చంద్రకళ, ఎల్ఐసి కృష్ణ యాదవ్ తెలిపారు. వార్డులో పాత స్తంభాలు, ఇండ్లపై ఉన్న వైర్లతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీవాసులు ఆందో ళన చెందుతున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే పాత విద్యుత్ స్తంభాలు, ఇండ్లపై ఉన్న వైర్లు తొలగించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని, ఇండ్లపై ఉన్న వైర్లను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆయన ఆదేశించారు. దీంతో స్పందిం చిన అధికారులు పాత విద్యుత్ స్తంభాలు, ఇండ్లపై ఉన్న వైర్లను తొలగించే కార్యక్రమాన్ని శుక్రవారం పూర్తి చేసినట్లు ఆమె చెప్పారు. వార్డులో విద్యుత్ స్తంభాలు, ఇండ్లపై ఉన్న వైర్ల సమస్యను పరిష్కరించిన సందర్భంగా ఎమ్మెల్యేకు కాలనీవాసుల తరఫున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

